
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
గురువారం 25 జనవరి 2024



లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో బసవరాజ్ హొరట్టికి చోటు



బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే సుదీర్ఘ కాలం విధానపరిషత్ సభ్యుడిగా కొనసాగిన సభాపతి బసవ రాజ్ హొరట్టి పేరు ఇండియన్ లిమ్కా ఆఫ్ బుక్ రికార్డ్స్‌లో చేరింది. సుదీర్ఘ కాలంగా ఆయన ఎమ్మెల్సీగా ఉన్నారు. గతంలో మంత్రిగాను వ్యవహరించారు. ప్రస్తుతం పరిషత్ సభాపతిగా వ్యవహరిస్తున్నారు. 1980 నుంచి వరుసగా పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందుతూ వస్తున్నారు. 2022లోనే రికార్డుగా 8వ సారి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఈ ఏడాది లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చేర్చారు.

పదవుల పందేరానికి బ్రేక్



- బోర్డులు, కార్పొరేషన్‌లపై భిన్నాభిప్రాయాలు
- తమను సంప్రదించలేదని మంత్రుల అసంతృప్తి

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బోర్డులు, కార్పొరేషన్ అధ్యక్ష పదవులను కట్టబెట్టడం ద్వారా లోక్‌సభ ఎన్నికలకు ముందు అసంతృప్తిని చల్లార్చడంతోపాటు ఉత్సాహంగా పనిచేసేలా ప్రోత్సహించవచ్చునని భావించిన కాంగ్రెస్ అధిష్టానానికి రాష్ట్ర మంత్రుల తీరు షాక్ ఇస్తోంది. గడిచిన వారం రోజులుగా అదిగో ఇదిగో జాబితా వచ్చేస్తోందంటూ స్వయానా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించినా సాధ్యం కావడం లేదు. 36 మంది ఎమ్మెల్యేలు, మరో 36 మంది నాయకులకు బోర్డులు, కార్పొరేషన్ పదవులు ఇవ్వడానికి జాబితా సిద్ధం చేశారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా బోర్డులు, కార్పొరేషన్ పదవులను ఖరారు చేసేందుకే ఐదారుసార్లు బెంగళూరుకు వచ్చారు. తాజాగా ఒకటి రెండు రోజుల్లో జాబితా వెలువడతుందనే ప్రచారం సాగుతున్న వేళ హోంశాఖ మంత్రి పరమేశ్వర్ తమ శాఖ పరిధిలో ఎవరికీ పదవులు ఇస్తున్నారనేది తమతో చర్చించలేదని చేసిన బహిరంగ ప్రకటన మొత్తానికే బ్రేక్ పడేలా చేసింది. పరమేశ్వర్, డీసీఎం డీకే శివకుమార్ మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో వివాదాన్ని మరింత పొడిగించరాదని అధిష్టానం అభ్యంతరం వ్యక్తం చేసింది. జాబితాను సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ ఖరారు చేశాక మరోసారి పార్టీ ఇన్‌చార్జ్ రణదీప్ సింగ్ సుర్జేవాలాతోనూ ఆమోదం పొందారు. ఇక పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సంతకం చేయడమే తరువాయిగా ఉండేది. అయితే కలబురగికి చెందిన పలువురి పేర్లు జాబితాలోకి రావడంతో సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం హుటాహుటిన సుర్జేవాలా బెంగళూరుకు చేరుకుని, సీఎం, డీసీఎంతో రహస్యంగా చర్చించారు. అంతలోనే పరమేశ్వర్ స్పందిస్తూ ఇదంతా ఏకపక్షంగా ఉందని, సంబంధించి శాఖల మంత్రులతో కనీసం చర్చించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీలో జిల్లాల వారీగా ఎవరు పనిచేశారనేది తమకూ తెలుసని, తమ అభిప్రాయాలు లేకనే పదవులు పంచితే నిజాయితీగా పార్టీలో కొనసాగేవారికి అన్యాయం జరుగుతుందన్నారు. తొలుత ఎమ్మెల్యేలను మాత్రమే కీలక బోర్డులు, కార్పొరేషన్‌లకు ఖరారు చేశారని, ఆ తర్వాత నాయకులకూ పదవులు ఇవ్వాలనే రాహుల్ గాంధీ సూచనతో మార్పు జరిగిందని తెలుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్‌లో సీఎం, డీసీఎం మధ్య గ్రూపు విభేదాలు ఉన్నాయనే అంశం పలు సందర్భాలలో రుజువైంది. తాజాగా పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బృందం కూడా కీలకంగానే వ్యవహరిస్తున్నట్లు తేలింది. బోర్డులు, కార్పొరేషన్ అధ్యక్ష పదవుల అంశం మరింత వాయిదా పడే అవకాశం ఉన్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.



ఆశాజనకంగా కందుల ధర

- రైతుల్లో ఆనందం

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కందుల ధర క్రమేపీ పెరుగుతుండడంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కరువుతో అలమటించిన కల్యాణ కర్ణాటక, కిత్తూరు కర్ణాటక జిల్లాల్లోని కంది రైతులు తాజా పరిణామాలతో ఒకింత ఊరట చెందుతున్నారు. రాష్ట్రంలో అత్యధికంగా కలబురగి జిల్లాల్లోనే కంది పంట దిగుబడి అవుతోంది. గత ఏడాది ధర పడిపోవడంతో రైతులు దిగాలు చెందారు. 2023 ప్రారంభంలో క్వింటాలు రూ.9వేల నుంచి రూ.10వేల ధర పలికిన కందులు ఆగస్టు నాటికి గరిష్ఠంగా రూ.12,500కు చేరుకుంది. డిసెంబరు నాటికి ఒక్కసారిగా ఇది రూ.8,500కు పడిపోవడంతో కంది రైతులు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. సంక్రాంతి పండుగ అనంతరం కంది ధర గరిష్ఠంగా రూ.2వేలకు పైగా పెరగడంతో ధర ప్రస్తుతం క్వింటాలు రూ.10,300 వద్ద స్థిరపడినట్టు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. సంక్రాంతి అనంతరం కందుల ధర పెరగడంతో రైతులలో ఆనందం కనిపిస్తోంది. రానున్న ఐదారు నెలల్లో కందుల ధర మరింతగా పెరిగే అవకాశం ఉందని కలబురగి వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సమద్ పటేల్ మీడియాకు తెలిపారు. ఒక గుల్బర్గా జిల్లాలోనే 5.9 లక్షల హెక్టార్లలో కందిపంట సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా 1.89 లక్షల హెక్టార్లలో పంటనష్టం సంభవించిందన్నారు. అయినా 80 శాతం పంట చేతికి అందడంతో మొత్తమ్మీద రైతులలో ఆశాజనకమైన పరిస్థితి కనిపిస్తోందన్నారు. ఉత్తర కర్ణాటకతోపాటు హైదరాబాద్ కర్ణాటక ప్రాంత రైతుల్లోనూ హర్షం వ్యక్తమవుతోంది.



150 చెరువులకు కావేరి నీరు

- ఉనికి కోసమే ప్రధానితో దేవెగౌడ పొత్తు
- రాష్ట్ర ఎంపీలు కరువు పరిహారం తెచ్చారా...?
- ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అందరికీ తాగునీరు, సాగునీరు అందించేందుకు కట్టుబడి ఉన్నామని, మైసూరు జిల్లా పెరియపట్టణ తాలూకా పరిధిలో 150 చెరువులకు నీరు మళ్లిస్తామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పేర్కొన్నారు. ఈ పనులకు ముత్తిన ముళసోగేలో ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం బహిరంగసభలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిపిన చోటే హామీలు అమలు చేశానని చెప్పగలరా..? అని సవాల్ విసిరారు. పదేళ్లలో హామీ ప్రకారం 20కోట్ల మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండేదని, ఎక్కడా అమలు చేయలేదన్నారు. తమ ప్రభుత్వంలో కోలారు, చిక్కబళ్లాపుర జి ల్లాల చెరువులకు నీరు మళ్లించామని, అదే తరహాలోనే పెరియపట్ట ణ ప్రాంత చెరువులకు పూర్వవైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చా రు. గడిచిన సెప్టెంబరు నుంచి రాష్ట్రానికి కరువు నిధులు ఇవ్వాలని, ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాను కోరామని తెలిపారు. అయినా ఒక్క రూ పాయి కూడా విడుదల చేయలేదని విమర్శించారు. రాష్ట్రం నుంచి 25 మంది బీజేపీ ఎంపీలు ఉన్నారని, ఒక్కరు కూడా కరువు పరిహారం కోసం ప్రయత్నించలేదని తెలిపారు. మాజీ ప్రధాని దేవెగౌడ, ప్రధానమంత్రి మోదీతో పొత్తుకు వెళ్లడం కేవలం ఉనికి కోసమే అన్నారు. రాష్ట్రంలో 1.30 కోట్ల కుటుంబాలకు చెందిన 4.50 కోట్ల మందికి ప్రతి నెలా రూ.4 - 6వేల కోట్లు గ్యారెంటీల ద్వారా అందిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలోనే మేకెదాటు ప్రాజెక్టు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు వెంకటేశ్, మహదేవప్ప, బోసరాజు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగసభలో ప్రసంగిస్తున్న సీఎం



శంకుస్థాపన చేస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ తదితరులు

గోకర్ణ ఆలయానికి పర్యవేక్షక కమిటీ

ప్రభుత్వ ఆదేశాలను రద్దు చేసిన హైకోర్టు

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఉత్తరకన్నడ జిల్లా గోకర్ణలోని మహాబళేశ్వర ఆలయానికి సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షక కమిటీని నామినేట్ చేయడాన్ని హైకోర్టు ధర్మాసనం తప్పుబట్టింది. ప్రభుత్వ ఆదేశాలను రద్దు చేస్తూ బుధవారం తీర్పును ప్రకటించింది. సుప్రీంకోర్టు ద్వారా అనుమతులను పొంది పర్యవేక్షక కమిటీని నామినేట్ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది. మహాబళేశ్వర ఆలయానికి పాలకమండలి ఏర్పాటు చేసిన ప్రభుత్వ నిర్ణయంపై రామచంద్రాపుర మఠం పీఠాధిపతిపతి రాఘవేశ్వరస్వామి తరపున న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ధర్మాసనం తీర్పునిచ్చింది. రామచంద్రాపురం మఠం అధీనంలో గోకర్ణ మహాబళేశ్వర ఆలయం ఉంది. రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2003 ఏప్రిల్ 30న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ గెజిట్‌ను ప్రశ్నిస్తూ గోకర్ణ ఆలయం దేవదాయశాఖ పరిధిలోకి రాదని కోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా రాష్ట్ర ప్ర భుత్వం 2021 మే 4న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి బీఎస్ కృష్ణ అధ్యక్షతన 8 మంది సభ్యులతో పర్యవేక్షక కమిటీని ఏర్పాటు చేసింది. 20 23 ఎన్నికల తర్వాత అన్ని నామినేటెడ్ కమిటీలు రద్దు అయ్యాయి. గోకర్ణ ఆలయానికి కొత్తగా సభ్యులతో స మితిని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ మఠం, హైకోర్టులో పిటీషన్ దాఖలు చేసింది.

మహాబళేశ్వర



జాతీయ విద్యావిధానం అమలు చేయాలి

- గవర్నర్‌కు 10 లక్షల సంతకాలతో వినతి సమర్పణ

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జాతీయ విద్యావిధానం-2020కు రాష్ట్రంలో బ్రేక్ పడకుండా చూడాలని, ఈ దిశలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయాలని పీపుల్స్ ఫోరం ఫర్ కర్ణాటక ఎడ్యుకేషన్ గవర్నర్‌కు విజ్ఞప్తి చేసింది. బెంగళూరు రాజభవన్‌లో బుధవారం ఫోరం తరుపున మేధావులు, విద్యానిపుణులు ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌కు అందజేశారు. ఎన్ఈపీని అమల్లోకి తెచ్చిన తొలి రాష్ట్రంగా కర్ణాటక జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు పొందగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దీనికి బ్రేక్ వేసిందని ఫోరం ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 168 తాలూకాలు, 34 విద్యా జిల్లాలు, 2,630 పాఠశాలలు, కళాశాలకు చెందిన 83,600 మంది ఉపాధ్యాయులు, విద్యాసంస్థల పాలక మండళ్ల సభ్యులు, 26,980 మంది పోషకులు, 19,327 ఆన్‌లైన్ క్యాంపైన్ సభ్యులు, 8,88,173 మంది విద్యార్థులు కలిపి వెరసి 10,16,080 మంది సంతకాలు చేసిన మెమొరాండంను గవర్నర్‌కు సమర్పించామని ఫోరం నగరంలో బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మేధావులు, విద్యావేత్తలు

ఎమ్మెల్సీ ఎన్నిక రోజున బడ్జెట్ వద్దు

- గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యేల వినతి

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విధానపరిషత్ ఉప ఎన్నిక రోజునే రాష్ట్ర బడ్జెట్ నిర్వహించడం సరికాదని, వెంటనే ప్రభుత్వం మరో తేదీకి మార్పు చేసేలా ఆదేశించాలని రాష్ట్ర గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యేల కమిటీ వినతి పత్రం అందించింది. బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి అశ్వత్థనారాయణ నేతృత్వంలో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌ను కలసి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం రాజ్‌భవన్ వద్ద ఎమ్మెల్యేలు సునిల్ కుమార్, మునిరత్న, బైరతి బసవరాజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 16న విధానపరిషత్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ తేదీ ఖరారైందన్నారు. అదే రోజున రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టేలా ఇటీవలే మంత్రివర్గం నిర్ణయం తీసుకుందన్నారు. ఇలా పోలింగ్ రోజునే బడ్జెట్ ప్రవేశపెట్టడం సమంజసం కాదని గవర్నర్‌కు విన్నవించామన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టడం ద్వారా రాజకీయ ప్రభావం ఉంటుందన్నా రు. గవర్నర్ పరిశీలిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే హర్తాళ హాలప్ప, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ధీరజ్ మునిరాజ్ తదితరులు ఉన్నారు.



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ ఎమ్మెల్యేలు

చిక్‌పేట ఎమ్మెల్యే నివాసానికి ప్రతిపక్ష నేత



బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో ప్రతిపక్ష నేత ఆర్. అశోక్ బుధవారం చిక్‌పేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ నివాసానికి వెళ్లి ఆయనతో కొద్దిసేపు చర్చలు జరిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర తరహాలోనే ప్రతిపక్ష నేత అశోక్ కూడా పార్టీ ఎమ్మెల్యేలందర్నీ విశ్వాసంలోకి తీసుకునే దిశలో వారి నివాసాలకే వెళ్లి భేటీ అవుతున్నారు. నియోజకవర్గ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. మిత్రుడైన అశోక్ తమ నివాసానికి రావడం ఎంతో సంతోషంగా ఉందని అనంతరం ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్ మీడియాకు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికి టికెట్ ఇచ్చినా భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని ఆయన ప్రకటించారు.

ఎమ్మెల్యేతో చర్చిస్తున్న ప్రతిపక్షనేత

హాస్టళ్లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

బంగారపేట, జనవరి 24: బాలికల హాస్టల్లో ఉంటున్న విద్యార్థినుల సంఖ్యకు హాజరుకు పొంతన కుదరడం లేదని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణ స్వామి అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణంలోని దేవరాజ్ అరసు వెనుకబడిన వర్గాల బాలికల హాస్టల్, అంబేడ్కర్ బాలుర హాస్టల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందచేస్తున్న ఆహారం, పడకలు, బెడ్‌షీట్లు నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ బాలుర, బాలికల హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థుల ఖచ్చితమైన సంఖ్య చెప్పడం లేదన్నారు. హాస్టల్‌లో భోజనానికి ప్లేట్లు కూడా లేవని విచారం వ్యక్తం చేశారు. సమగ్ర వివరాలు ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిపారు. ఆరు నెలల్లోగా అన్ని మౌలిక సదుపాయాలు మెరుగు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రశ్మి, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవికుమార్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివారెడ్డి, ఆర్ఐ అజయ్ పాల్గొన్నారు.



సమస్యలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే నారాయణ

దేశమంతటా మోదీ హవా

- దక్షిణాదిలో ఈసారి ఆశ్చర్యకర ఫలితాలు
- మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై


బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ హవా బలంగా వీస్తోందని, ఈసారి దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఆశ్చర్యకరమైన ఫలితాలు వెలువడే అవకాశం ఉందని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై పేర్కొన్నారు. బెంగళూరులోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కేఏఎస్ మాజీ ఉన్నతాధికారి ఆర్ రుద్రయ్య పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయనను బొమ్మై సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దేశప్రజలంతా మోదీ వైపు, బీజేపీ వైపే చూస్తున్నారని పేర్కొన్నారు. తమ చిరకాల ఆకాంక్షలను నెరవేరుస్తున్నందుకు మోదీపై ప్రజల్లో నమ్మకం బాగా పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో 2019 కంటే అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోనుందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లోనూ బీజేపీ ఎంపీ స్థానాల సంఖ్య గతంలో కంటే బాగా పెరగనున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకులన్నీ బీటలు వారుతున్నాయని, ప్రత్యేకించి ఎస్సీ ఎస్టీ వర్గాలకు కాంగ్రెస్‌పై ఉన్న భ్రమలు క్రమేపీ తొలగిపోతున్నాయని అన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఖర్చుచేయాల్సిన రూ.11 వేల కోట్లను గ్యారంటీకు మళ్లించి ద్రోహం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. దళితుల సంక్షేమం బీజేపీతోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ కుటుంబ పార్టీ అని, బీజేపీలో మాత్రమే సామాన్య కార్యకర్తకు కూడా అత్యున్నత స్థానాన్ని అలంకరించే అవకాశం లభిస్తోందన్నారు. ప్రతిపక్ష నేత ఆర్. అశోక్‌తో పాటు లోక్‌సభ సభ్యుడు ఎస్.మునిస్వామి, రాయచూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శివరాజ్‌పాటిల్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేంద్ర కౌతాళ, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమి ఛిద్రం

లోక్‌సభ ఎన్నికల నాటికి ఇండియా కూటమి ఛిద్రం కానుందని, ఎన్నికల అనంతరం పూర్తిగా అదృశ్యం కానుందని బొమ్మై జోస్యం చెప్పారు. నగరంలో బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇండియా కూటమి నుంచి ఇప్పటికే సమాజ్‌వాదిపార్టీ వైదొలిగిందని, తాజాగా మమతా బెనర్జీ కూడా గుడ్‌బై చెప్పేశారని అన్నారు. కాంగ్రెస్ వ్యవహార తీరును తట్టుకోలేక కూటమి నుంచి ఒక్కొక్కరే మెల్లగా జారుకుంటున్నారని పేర్కొన్నారు. త్వరలో శరద్ పవార్, నితీష్‌కుమార్ కూడా కూటమికి గుడ్‌బై చెప్పే అవకాశం కనిపిస్తోందన్నారు. భక్తి అనే కళ్లజోడు ధరించి చూస్తే శ్రీరామచంద్రుడు సర్వత్రా కనిపిస్తాడని, అప్పుడే మోక్షం సాక్షాత్కరిస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ఉద్దేశించి బొమ్మై వ్యాఖ్యలు చేశారు.



కేఏఎస్ మాజీ ఉన్నతాధికారి రుద్రయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న బసవరాజ్ బొమ్మై



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.75	1,618.46
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	451	8,399
సామర్థ్యం (టీఎంసీలు)	10.02	57.12

అన్నిరంగాల్లో ఆడపిల్లలు ముందంజ

జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ ఎస్‌హెచ్ పుష్పాంజలి దేవి

బళ్లారి సిటీ,జనవరి 24: సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో సమానంగా ఎదుగుతున్నారని, ఇది గర్వించదగ్గ విషయమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్మన్ ఎస్‌హెచ్. పుష్పాంజలి దేవి అన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, జిల్లా ఆసుపత్రి వారి సంయుక్తాధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో అభియాన్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచంలో స్త్రీ మనసుపెడితే ఏదైనా సాధించగలదన్నారు. ఆడపిల్లలను రక్షించి చదివించాలన్నారు. జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా అధ్యక్షత వహించి మాట్లాడుతూ, దేశ రాష్ట్రపతి, జిల్లా ప్రధాన జడ్జి కూడా మహిళలే కావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మహిళా శిశు అభివృద్ధి శాఖ విడుదల చేసిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బీదలకు మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లాలీగల్ సీనియర్ సివిల్ జడ్జి రాజేశ్‌హొసమనె , జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, స్త్రీ శిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి పుష్పాంజలి దేవి

భేటీ బచావో భేటీ పడావోపై సైకిల్ ర్యాలీ

తోరణగల్లు, జనవరి 24 : తాలుకాలోని తాశ్లూరు గ్రామంలో మహిళలు, పిల్లల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భేటి బచావో భేటి పడావో జాగృతి కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ అధికారులు లక్ష్మీ ప్రసన్న, ఆరోగ్య శిక్షణ అధికారి శివప్పలు మాట్లాడుతూ ఆడ పిల్లల సంఖ్యనుపెంచాలని లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఆడపిల్లల్ని చక్కగా చదివించి అభివృద్ధిలోకి తీసుకురావాలని తారతమ్యాలు చూపించరాదన్నారు. ఆడపిల్లలకు ప్రోత్సాహకరంగా భాగ్యలక్ష్మీ, సుకన్య సమృద్ధి యోజనలు ప్రవేశపెట్టారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సభ్యులు మాబున్ని, ఆశాబి, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామ రంగోత్సవాలు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెన్నప్ప

బళ్లారి సిటీ, జనవరి 24: అయోధ్యలో శ్రీరామ ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రతిఇంట్లో శ్రీరామపూజ, దీపాలంకరణ చేసినట్లే దేశవిదేశాల్లో రామనామస్మరణ మార్మోగుతోంది. రాఘవ కళామందిరంలో మూడు రోజుల పాటు జరిగే శ్రీరామరంగమహోత్సవాలను జీవిత సాఫల్య పురస్కారగ్రహీత చెన్నప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి శ్రీరామ మందిర స్థాపన కోసం వందేళ్ళ పోరాటం చేయడం చిరస్మరణీయమన్నారు. నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది జనార్దన మాట్లాడుతూ, అందరికీ ఆదర్శంగా నిలిచేలా శ్రీరాముడిని నిలబెట్టేందుకు దేశప్రధాని కూడా దీక్ష చేశారన్నారు. సీనియర్ బయలాటకళాకారుడు హనుమంతావధూత మాట్లాడుతూ కూలీల నుంచి సినీ నటులు, రాజకీయ నాయకుల వరకు అందరూ ఏకతాటిపైకిరావడం శ్రీరాముడి మహిమ అన్నారు. ఈ సందర్భంగా పద్మావతిబృందం ప్రదర్శించిన అయోధ్యరామ నృత్యరూపకం అందరిని ఆకర్షించింది. ప్రభుదేవా కప్పగల్లు, అడివిస్వామి, రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం రామరావణ యుద్ధ బయలాటను ప్రదర్శించారు.

భ్రూణ హత్యలు విచారకరం



బాలికా దినోత్సవంలో మాట్లాడుతున్న రవిచెల్లగుర్కి

బళ్లారి సిటీ. జనవరి 24: లింగ వివక్ష నిర్మూలన, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ స్త్రీ శిశువుల భ్రూణ హత్యలు నేటికీ కొనసాగుతున్నాయని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా యూనిట్ అధ్యక్షుడు రవి చెల్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయకోట ప్రభుత్వ పాఠశాలలో బుధవారం జరిగిన బేటీ బచావో, బేటీ పడావో అనే కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఆడపిల్లలను అబ్బాయిలతో సమానంగా చూడడం లేదనేది ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రతి వెయ్యి మంది బాలురకుగాను తొమ్మిది వందల మంది మాత్రమే బాలికలు ఉన్నారన్నారు. దీన్ని అధిగమించేందుకు బాలికల కోసం నిధిని నిర్మించేందుకు సుకన్య సమృద్ధి యోజనను అమలు చేశారన్నారు. ఈసందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, శ్రీదేవి, నింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ విధ్వంసకులను శిక్షించాలి



వినతిపత్రం అందజేస్తున్న పదాధికారులు

బళ్లారి గాంధీనగర్, జనవరి 24: గుల్బర్గా జిల్లా కోటనూరు ప్రాంతంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కర్ణాటక దళిత సంఘర్ష సమితి బుధవారం జిల్లాధికారి కార్యాలయం ముందు ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ, రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానించే రీతిలో విగ్రహాలను ధ్వంసం చేస్తున్న ఘటనలు రాష్ట్రంలో వెలుగు చూస్తున్నాయన్నారు. ఇలాంటి సంస్కృతికి అడ్డుకట్టు వేసే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతి పత్రాన్ని జిల్లా సహాయాధికారికి అందజేశారు. నాగరాజు, ఉపాధ్యక్షులు దురగేష్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షులు హెచ్.వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం మూత: టీచర్ తొలగింపు

కంప్లి, జనవరి 24 : శిరిగేరి పరిధిలోని మన్నూరు సూగూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం-3లో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ బసమ్మను విధుల నుంచి తొలగిస్తూ జిల్లా జెడ్పీ సీఈవో శరణప్ప సంకనూరు ఆదేశాలు జారీచేశారు. విధి నిర్వహణా సమయంలో అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేయడంతో ఆమెను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ఈ విషయంపై అంగన్‌వాడీ కేంద్రం జిల్లా అధికారిని విచారించగా టీచర్ విధుల్లో లేకపోవడం వల్లనే ఆమెను సస్పెండ్ చేసినట్లు అప్పటికే జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఇకపై జిల్లాల్లో డ్యూటీ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎవరు తాళం వేసినా వారికి శిక్ష తప్పదని తెలిపారు.



మన్నూరుసూగూరులో తాళం వేసిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శరణప్ప సంకనూరు

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చర్యలు



చెరువుపనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ హామీ

కంప్లి, జనవరి 24 : నియోజకవర్గంలో రానున్న వేసవిని దృష్టిలో వుంచుకుని ప్రతి గ్రామంలో పైపులైన్లు ఏర్పాటుచేసి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. దేవలాపురంలో రూ. 4.20 కోట్లతో చేపట్టిన నూతన చెరువు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే పలు గ్రామాల్లో సర్వే చేపట్టి చెరువులను నీటితో నింపి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. దీంతో పాటు విద్యార్థులకు బస్సుసౌకర్యం కల్పించామన్నారు. ఇతరత్రా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఈరమ్మ రమేష్, పీడీవో శశికాంత్, శ్రీనివాసరావు, మరేగౌడ, అంజినప్ప, గ్రామ పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతే మనకు నిజమైన సంపద

తోరణగల్లు, జనవరి 24 : నిజమైన సంపద మన భాష, మన సంస్కృతి అని ప్రిన్సిపాల్ కొట్రేష్ అన్నారు. తోరణగల్లు శ్రీ బసవేశ్వర గ్రామాంతర పాఠశాలలో కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం గుండమ్మ సుబ్బన్న జ్ఞాపకార్థం జరిగిన దత్త ఉపన్యాస కార్యక్రమంలో జేఎస్‌డబ్ల్యూ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కొట్రేష్ పాల్గొన్నారు. ఆనాటి మహనీయుడు సర్వజ్ఞల వచనాలపై ప్రసంగిస్తూ ఆ వచనాలు ఎంతో అర్థవంతమైనవని ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లలు ఆ వచనాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో అభివృద్ధి చెందాలన్నారు. మానసిక వికాసానికి తోడ్పడుతాయని 2100 సర్వజ్ఞుల వచనాలు లభ్యం అయ్యాయన్నారు. మన నిజమైన సంపద మన భాష, సంస్కృతి అని వాటిని గౌరవించాలని చెప్పారు. అలాగే డాక్టర్ బసవరాజు మాట్లాడుతూ కన్నడ భాషను అందరు కలిసి ఇంకా అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోరణగల్లు, హంబ్లి కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు రిటైర్డ్ టీచర్ ఆర్‌బీ నాయక్, ప్రముఖ డాక్టర్ బసవరాజు కార్యక్రమ దాత అప్పనహళ్లి, ప్రిన్సిపాల్ బారియప్ప, పాఠశాల సిబ్బంది, విజయ్ కుమార్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కొట్రేష్

చిరు ధాన్యాలపై రైతులకు అవగాహన యాత్ర

హోసూరు(మత్తిగిరి) జనవరి 24 : చిరుధాన్యాల వలన కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకునేందుకు హోసూరు తాలూకా అమ్మెట్టి, పేరండపల్లి , ఇస్లాంపురం గ్రామాలకు చెందిన 50 మంది రైతులను రాష్ట్ర స్థాయి రైతు అవగాహన యాత్రకు తీసుకెళ్లారు. వ్యవసాయ సహాయ సంచాలకులు హోసూరు భువనేశ్వరి ఆధ్వర్యంలో తిరువణ్ణామలై జిల్లా అధ్యాన్‌తలిల్ చిరు ధాన్యాల మ్యాగ్నిఫికేషన్ సెంటర్‌కు రైతులను పరిశీలన పర్యటనకు తీసుకెళ్లారు, స్మాల్ గ్రెయిన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చిరు ధాన్యాల విలువ , ప్రయోజనాలు, వివిధ రకాల అల్పాహారాలు బుగ్గాలు, సేమియా ఇడియాప్పం, అల్వా, సత్తు పిండి, మొక్కజొన్న లడ్డులు, మొక్కజొన్న గింజల బిస్కెట్లు, తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. ప్రొపెసర్ వైద్యలింగం పాల్గొని వ్యవసాయ దారులకు చిరు ధాన్యాలను ఉపయోగించి రొట్టి, గంజి, దోసే, నూడల్స్ జంతికలు, పుట్టు గురించి వివరించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సత్య చిరు ధాన్య సాగులో సాంకేతికతలు, తెగుళ్ల, వ్యాధుల నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరంగా తెలయజేశారు, వాటిపై పరిశీలన చేసి వాటికి సేంద్రీయ ఎరువులు ఇచ్చి మంచిగా పెంచేందుకు వీలుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు చిరు ధాన్యాల విలువ గురించి కరపత్రాలు అందజేశారు, ఆత్మ టెక్నికల్ మేనేజర్లు సుగుణ, షణ్ముగం, పరిశీలన పర్యటనకు ఏర్పాటు చేశారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

బళ్లారి గాంధీనగర్, జనవరి 24: సమాజంలో ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి డాక్టర్ వై.రమేష్ బాబు పేర్కొన్నారు. జిల్లా పాలనా మండలి, మహిళా నర్సింగ్ కళాశాల బాలికా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ఆడపిల్లలను రక్షించేందుకు లింగనిర్ధారణ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలుచేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. అనంతరం నగర పురవీధుల్లో నర్సింగ్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సర్జన్ బసరెడ్డితో పాటు జిల్లా కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ పూర్ణిమా కట్టిమని, ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ రాఘవేంద్ర, ఉపాధ్యక్షులు డాక్టర్ మాణిక్ రావ్ కులకర్ణిట, జాయింట్ కార్యదర్శి డాక్టర్ సంగీత కట్టిమని తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రమేష్ బాబు

బ్రాహ్మణ సంఘ ప్రతినిధిగా శ్రీనివాసమూర్తి

సిరుగుప్ప, జనవరి 24 : అఖిల కర్ణాటక బ్రాహ్మణ రాజకీయ ప్రతినిధి కార్యదర్శిగా శ్రీనివాసమూర్తి ఎన్నికైనట్లు రాజ్యాధ్యక్షులు రాఘవేంద్ర తెలిపారు. సిరుగుప్ప తాలుకాలో బ్రాహ్మణుల అభివృద్ధికి ఎంతో పోరాటం చేసిన వ్యక్తి శ్రీనివాసమూర్తి అని, ఈ కారణంగా బళ్లారి, కొప్పాళ, విజయనగర జిల్లాలకు రాజకీయ ప్రతినిధిగా ఆయనను నియమించామన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ వివిధ సమస్యలపై రానున్నరోజుల్లో మరింత పోరాటం చేస్తామన్నారు. ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు.



శ్రీనివాసమూర్తి (ఫైల్)

మహనీయుల జయంతిని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ, జనవరి 24: ఫిబ్రవరి 1న మడివాళ మాచిదేవయ్య జయంతి, 10న కాయక శరణ జయంతిని జిల్లాయంత్రాంగం ఘనంగా నిర్వహించనున్నట్లు అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్ జుబేరా తెలిపారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయ హాల్లో బుధవారం జరిగిన ప్రాథమిక సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాయంత్రాంగం, కన్నడ సాంస్కృతిక శాఖ తరపున మహనీయుల జయంతిని అర్థవంతంగా నిర్వహించాలన్నారు. జయంతి రోజుల్లో కనకదుర్గమ్మ ఆలయం నుంచి గడిగి చెన్నప్ప సర్కిల్ మీదుగా బీబీఏప ఫుట్‌బాల్ మైదానం వరకు ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం వేదికా కార్యక్రమం ఉంటుందన్నారు. కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు బి.నాగరాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జయంతి ఊరేగింపుకు వివిధ సాంస్కృతిక బృందాలను ఆహ్వానిస్తామన్నారు. ఆహ్వాన పత్రం ముద్రించి ప్రముఖులను ఆహ్వానిస్తామని తెలిపారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు

కంప్లి, జనవరి 24 : రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో వుంచుకుని విద్యార్థినీ విద్యార్థులకు కుడితిని పట్టణంలో ఏసీసీ అదానీ ఆధ్వర్యంలో ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీసీ అదానీ మేనేజర్ షబ్బీర్ షేక్ మాట్లాడుతూ బలహీనత వున్న విద్యార్థులు అవసరమైన పౌష్టికాహారం తీసుకున్నట్లయితే పరీక్షలకు సిద్ధం కావచ్చునన్నారు. కుడితిని, సిద్ధమ్మనహళ్లి, వేణి వీరాపురంలలో 500 మంది హైస్కూళ్ల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ షబ్బీర్ బాషా ఈ పరీక్షలు నిర్వహించారు. వీరితో పాటు హరీష్, భాగ్య, వేదమూర్తి, విద్య, రవి తదితరులు పాల్గొన్నారు.



రక్తపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గణతంత్ర వేడుకలకు భారీ ఏర్పాట్లు

సిరుగుప్ప, జనవరి 24 : తాలుకా హైస్కూలు గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. జాతీయ జెండాను తహసీల్దార్ హెచ్ విశ్వనాథ్ ఎగుర వేయనున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బీఎం నాగరాజు అధ్యక్షత వహించనున్నారు. 26వ తేదీ ఉదయం 9 గంటలకు వివిధ శాఖల ప్రభుత్వాధికారులు, ప్రతినిధులు, వివిధ సంఘ సంస్థల ప్రతినిధులు హాజరు కావాలని వేడుకల కమిటీ అధ్యక్షులు విశ్వనాథ్ కోరారు.

హోసూరు జోన్

కొత్త రథానికి ప్రత్యేక పూజలు



తేరుపేటలో ఆలయం వద్ద మరగతాంబ నూతన రథం

హోసూరు జనవరి 24 :హోసూరు తేరుపేటలో మరగతాంబ ఆలయ నూతన రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్చి నెలలో జరిగే రథోత్సవానికి తయారు చేసిన కొత్త రథాన్ని బుధవారం పుర వీధుల గుండా తీసుకొచ్చారు. ఆ ప్రాంత వాసులు కొత్త రథానికి పూజలు చేసి ఆనందించారు, హిందు ధార్మిక శాఖ అనుమతితో కొత్త రథాన్ని రూ. కోటి వ్యయంతో నిర్మించారు. 14 అడుగుల ఎత్తు కలిగిన నూతన రథాన్ని తిరువారూరుకు చెందిన స్థపతి ఇళవరసన్ బృందం రూపకల్పన చేసింది. రథోత్సవ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే కె.ఏ.మనోహరన్ నేతృత్వంలో బీజేపి పశ్చిమ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజ్, మురుగన్ , ప్రవీణ్‌కుమార్, రాము, శక్తివేల్, రథం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, బాలకృష్ణన్, వెంకటస్వామి, అరుణగిరి కళ్యాణ మంటపం యజమాని భద్రశెట్టి, చంద్రశేఖర్, అశోక్‌కుమార్, జయదేవన్, రాజు, రాజ్‌కుమార్, నాగరాజ్, కృష్ణమూర్తి, లోకనాథన్, కౌన్సిలర్లు పార్వతి నాగరాజ్, రాజీ , మాజీ కౌన్సిలర్ పాండియన్‌ల సమక్షంలో రథానికి ప్రత్యేక పూజలు జరిగాయి.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం

హోసూరు(కృష్ణగిరి) జనవరి 24 :జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం రెవిన్యూ కమీషనర్ సి.బాబు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కావేరిపట్నం బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మీదుగా ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చేరుకుంది. ఈ ర్యాలీలో మహిళా హక్కుల కోసం పోరాడుదాం అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో కావేరిపట్టణ బాలికల ఉన్నత పాఠశాల నుంచి 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి 100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, కుమార్ జ్యోతి నర్సింగ్ కళాశాల నుంచి 15 మంది విద్యార్థులు, హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా జిల్లా సాంఘీక సంక్షేమ అధికారిణి కె.విజయలక్ష్మి, కృష్ణగిరి జిల్లా కలెక్టర్ విజయకుమార్, జిల్లా అభివృద్ధి అధికారులు ఉమాశంకర్, సుబ్రహ్మణి, జిల్లా వైద్యాధికారి తామరైసెల్లి, కావేరిపట్నం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వళర్మతి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు వేందన్, కుమార్ జ్యోతి , నర్సింగ్ కళాశాల ఉద్యాన కళాశాల ప్రిన్సిపాల్ , రెవిన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పరిపాలనాధికారులు, బాలల సహాయ కేంద్రం, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పాల్గొన్నారు.

హోసూరు కావేరి ఆసుపత్రిలో అవయవ దానం

హోసూరు జనవరి 24 :హోసూరు కావేరీ ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందిన ద్రావిడ కళగ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.లక్ష్మికాంతన్ (68) అవయవాలను దానంచేశారు. ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబికులు అంగీకరించడంతో హోసూరు ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న రోగులకు వెంటనే ఒక కిడ్నీ, కాలేయాన్ని శస్త్ర చికిత్స ద్వారా మార్పిడి చేశారు. అలాగే మరో కిడ్నీని మేల్మరువత్తూరు ఆదిపరాశక్తి వైద్య కళాశాల ఆస్పత్రికి పంపించారు. హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, హోసూరు తహసిల్దార్ సుబ్రహ్మణి, హోసూరు కావేరిఆసుపత్రి జనరల్ మేనేజర్ జోష్ వర్గీస్ జాయ్ మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మికాంతన్ కుమారుడు కావేరి ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు తెలిసింది. అందరు అతనికి అతని కుటుంబికులకు కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష్మికాంతన్(ఫైల్)

సమగ్ర సాగుతోనే రైతులకు లాభం

వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఎం.హనుమంతప్ప

రాయచూరు జనవరి 24: రైతులు సాగువిధానాల్లో సరికొత్త మార్పులను అమలు చేయాలని వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఉపకులపతి ఎం.హనుమంతప్ప సూచించారు. ఒకే విధమైన సాగుద్వార కాకుండా వ్యవసాయానికి అనుబంధంగా ఉండే గొర్ల పెంపకం, కోళ్ల పెంపకం, పట్టు పరిశ్రమ ఇతరత్ర వాటి పై దృష్టి సారించాలన్నారు. సాగులో మెళకువలు తీసుకోవల్సిన జాగ్రతలు తదితర అంశాలపై రైతులకు బుధవారం వ్యవసాయవిశ్వవిద్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడిన ఎం.హనుమంతప్ప, రైతులు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలుగా ఉండేవాటిని గుర్తించి తమకు అనువైన వాటిని ఎంపికచేసుకుని లాభాలు గడించాలన్నారు. కేవలం సాగుపై మాత్రమే ఆధార పడడంవల్ల ఆర్థికంగా తగిన లాభాలు ఆర్జించడం కష్టమన్నారు. ఈ దిశగా రైతులందరూ సమగ్రకృషి విధానంవైపు అడుగువేయాలన్నారు.



చెక్కబెరగిలో వృద్ధుడిపై అమానుష దాడి

రాయచూరు జనవరి 24: జిల్లాలోని సింధనూరు తాలూకా చెక్కబెరగి గ్రామంలో ఒక వ్యక్తి పై 9 మందికి పైగా గ్రామానికి చెందిన వ్యక్తులు సామూహిక దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. స్త్రీల పట్ల అసభ్యంగా మాట్లాడాడన్న ఆరోపణ మేరకు 83 ఏళ్ల నింగప్పను గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు బలవంతంగా ఏర్పుకెళ్లి గ్రామ మధ్యలోని విద్యుత్ స్తంభానికి తాళులతో కట్టేసి దాడికి దిగారు. తాను ఏలాంటి తప్పు చేయలేదని ఒక వేళ జరిగి ఉంటే క్షమించమని బాధితుడు ప్రాధయపడుతున్నా పట్టించుకోని నిందితులు పిడిగుద్దెలతో దాడి చేశారు. బాధితుడి భార్య అక్కడికి చేరుకుని తన భర్తను విడిచి పెట్టాలని ప్రాదాయపడినా ఆమె పై కూడా చెప్పులతో దాడి చేసినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ మొత్తం వ్యవహారాన్ని గుర్తుతెలియని వ్యక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ సంఘటన కాస్త వైరల్‌గా మారి పోలీసులకు చేరింది. వెంటనే స్పందించిన తుర్విహాళ్ పోలీసులు బాధ్యులుగా గుర్తించి 9 మంది పై కేసు నమోదు చేశారు. ఇందులో ఒక్కరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మిగితా 8 మంది కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.



స్తంభానికి కట్టేసి నింగప్పపై దాడికి దిగిన నిందితులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

విలియమ్ సోమర్‌సెట్ మామ్ (జయంతి)



విలియమ్ సోమెర్‌సెట్ మామ్ 1874 జనవరి 25న ఫ్రాన్స్ దేశం ప్యారిస్‌లో జన్మించారు. ఆంగ్ల నాటక, నవలా రచయిత, చిన్నకథల రచయిత. 1930 దశకంలో అత్యధిక పారితోషికం పొందిన రచయితలలో ఒకరిగా నిలిచారు. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో రెడ్ క్రాస్‌తో కలసి పనిచేశారు. బ్రిటీష్ సీక్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్‌లో పనిచేశారు. యుద్ధం అనంతరం ఇండియాతోపాటు దక్షిణ ఆసియా, పసిఫిక్‌లో పర్యటించిన అనుభవాలతో సెమీ-ఆటోబయోగ్రఫీ నవల రాశారు. 1954లో 'కంపానియన్ ఆఫ్ హానర్' గౌరవం పొందారు. 1965 డిసెంబరు 16న కన్నుమూశారు.

వర్జీనియా వూల్ఫ్ (జయంతి)



ప్రముఖ ఆంగ్ల రచయిత్రి అడెలైన్ వర్జీనియా వూల్ఫ్ 1882 జనవరి 25న లండన్‌లోని కెన్సింగ్‌టన్ ప్రాంతంలో జన్మించారు. 20వ శతాబ్దపు ఆధునిక కవయిత్రులలో ఒకరిగా రాణించారు. 500కు పైగా ఆటోబయోగ్రఫీలు, వ్యాసాలు, రివ్యూలు రాశారు. ప్రత్యేకించి మానవ సంబంధాలు, ఆధునిక పరిస్థితులను తలపించేలా రచనలు ఉండేవి. కవితలు, లెక్కకు మిక్కిలి నవలలు రాసి ప్రచురించారు. 1941 మార్చి 28న కన్నుమూశారు.

కేఎస్ నారాయణ అయ్యంగార్ (జయంతి)



కేఎస్ నారాయణ అయ్యంగార్ 1903 జనవరి 25న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలి ప్రాంతంలో జన్మించారు. దక్షిణాదిన కర్ణాటక సంగీత వాయిద్యమైన చిత్రవీణ (గోటువాద్యం) కళాకారుడిగా పేరొందారు. గోటువాద్యాన్ని అభివృద్ధి చేసి అందరి మన్ననలు పొందారు. 20వ యేటనుంచి కచేరీలు ఇచ్చారు. తిరువనంతపురం, మైసూరు రాజ సంస్థానాలలోనూ ప్రదర్శనలు ఇచ్చారు. నాదబ్రహ్మ విద్యా వారిధి, దిగ్విజయ నాదవాణి, గోటువాద్య కళానిధి తదితర బిరుదులు పొందారు. 1959 జనవరి 11న కన్నుమూశారు.

ఎంఎన్ రాయ్ (వర్ధంతి)



మానవేంద్ర నాథ్ రాయ్ 1887 మార్చి 22న పశ్చిమ బెంగాల్‌లోని చాంగ్రిపోట ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు నరేంద్రనాథ్ భట్టాచార్య. హేతువాది, మానవతావాది, రాజకీయ సిద్ధాంతకర్త, 20వ శతాబ్ధపు తత్వవేత్తలలో ప్రముఖులు. రష్యా తర్వాత ప్రపంచంలో మొదటగా మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీ స్థాపించిన వ్యక్తి రాయ్. రష్యాలో లెనిన్ మరణానంతరం స్టాలిన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయ్ క్రియాశీలక కమ్యూనిస్టు రాజకీయాలనుంచి తప్పుకుని భారతదేశానికి వచ్చి రాడికల్ డెమోక్రటిక్ పార్టీని స్థాపించారు. 1944లో మన దేశానికి ప్రత్యేక రాజ్యాంగం ఉండాలనే భావనను ప్రతిపాదించిన తొలి భారతీయుడు. 17 భాషలలో ప్రావీణ్యం గలవారు. 1954 జనవరి 25న కన్నుమూశారు. కాగా ఎంఎన్ రాయ్ సాధనలపై ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ 4 వాల్యూమ్స్‌ను విడుదల చేయడం విశేషం.

కవితా కృష్ణమూర్తి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత కవితా కృష్ణమూర్తి సుబ్రమణియమ్ 1958 జనవరి 25న ఢిల్లీలో తమిళ కుటుంబంలో జన్మించారు. అసలు పేరు శారద. నేపథ్య గాయకురాలిగా 16 భాషలలో 25వేలకుపైగా పాటలు పాడారు. పాప్, భక్తి పాటలు సైతం ఆలపించారు. సంగీత ప్రధానమైన రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. ఆమె భర్త సుబ్రమణియమ్ వయోలిన్ కళాకారుడు. ఆమె బెంగళూరులో అకాడమీ ఆఫ్ పర్‌ఫార్మింగ్స్ ఆర్ట్స్‌ను ఏర్పాటు చేశారు. లతా మంగేష్కర్ అవార్డు, నాలుగు ఫిల్మ్‌ఫేర్, జీ సినీ అవార్డుతోపాటు పలు అవార్డులు పొందారు. జైన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు.

చతేశ్వర పూజారా (పుట్టినరోజు)



చతేశ్వర అరవింద్ పూజార 1988 జనవరి 25న గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌లో జన్మించారు. దేశ అంతర్జాతీయ క్రికెట్‌లో కేవలం టెస్ట్ క్రికెట్‌లు ఆడారు. సౌరాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ససెక్స్ కంట్రీక్లబ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. 18 టెస్ట్ ఇన్నింగ్స్‌లో 11 మ్యాచ్‌లలో వెయ్యి పరుగులు సాధించి ఫాస్టెస్ట్ బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా నిలిచారు. 2021లో ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టెస్ట్ బ్యాట్స్‌మన్‌గా వరల్డ్ నెంబరు 14వ స్థానంలో నిలిచారు. 2017లో ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 12వ సారి డబుల్ సెంచరీ సాధించి విజయ్‌మర్చంట్ రికార్డును అధిగమించారు. ఐదు వన్డేలలోనూ, ఐపీఎల్ 2021లో చెన్నై సూపర్‌కింగ్స్ జట్టులోనూ ఆడారు. ఇంటర్నేషనల్ క్రికెట్‌లో 19 సెంచరీలు పూర్తి చేశారు.

జలజీవన్ పథకంతో ఇంటింటికీ నీరు

చేళూరు, జనవరి 24: జలజీవన్ మిషన్ పథకం ద్వారా అన్ని గ్రామాలలోనూ ప్రజలందరికీ ఇంటింటికీ శుద్ధతాగునీరు అందించనున్నట్టు ఎమ్మెల్యే సుబ్బారెడ్డి తెలిపారు. తాలూకాలోని పాతపాళ్య సమీపాన నల్ల సాంపల్లిలో జలజీవన్ మిషన్ పథకానికి శ్రీకారం చుట్టారు. వచ్చే వేసవిలో నీటి ఇబ్బంది తలెత్తకుండా చూడడమే లక్ష్యమన్నారు. కాగా పలు గ్రామాలలో మూగ జీవాలకోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయని, కొన్ని చోట్ల నీరు ఉన్నా తాగడానికి ఉపయోగం లేకుండా మారాయని గ్రామస్థులు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

రాజకీయాల్లోకి వెళ్లను.. వైద్యవృత్తినే కొనసాగిస్తా

» జయదేవ డైరెక్టర్ సీఎన్ మంజునాథ్



డాక్టర్ సీఎన్ మంజునాథ్

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జయదేవ ఆసుపత్రుల డైరెక్టర్ హోదాలో పద్మశ్రీ గ్రహీత సీఎన్ మంజునాథ్ ఈనెలాఖరున పదవీ విరమణ పొందుతున్నారు. ఈలోగా వచ్చే లోక్‌సభ ఎన్నికల ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశిస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదే విషయమై బుధవారం డైరెక్టర్ సీఎన్ మంజునాథ్ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లోకి వెళ్లనని స్పష్టం చేశారు. వైద్య వృత్తినే కొనసాగిస్తానన్నారు. రాజకీయంగా ఆఫర్ వచ్చిందనేది తప్పుడు ప్రచారమన్నారు. పాలకమండలి నిర్ణయంతో తన బాధ్యతలు ముగుస్తాయని పేర్కొన్నారు. 16 ఏళ్లుగా జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్‌గా వ్యవహరించానన్నారు. 500శాతం అభివృద్ధి జరిగిందనే సంతోషం ఉందన్నారు. జయ దేవలో 300 పడకలు ఉండేవని ప్రస్తుతం 2వేల పడకల స్థాయికి పెంచామన్నారు. దక్షిణ ఆసియాలోనే అతిపెద్ద హృద్రోగ సంస్థగా పేరొందిందన్నారు. ఫైవ్‌స్టార్ తరహాలో ఆసుపత్రి ఉండాలని కలలు గన్నానని, అది సాధ్యమైందన్నారు. శ్రీమంతులకు వైద్యం అందించాలనే ఆశయం ఫలించిందన్నారు. 75 లక్షల ఓపీడీలు జరిగాయని, 8 లక్షల ఆపరేషన్‌లు చేశామన్నారు. గత ఏడాది మే నెలలో కేంద్ర పార్లమెంటరీ కమిటీ జయదేవను సందర్శించిందని, ఇక్కడి చికిత్సా విధానం దేశంలోనే మార్గదర్శకమని కొనియాడారన్నారు. జయదేవ హృద్రోగ సంస్థ మైసూరులో 2010లో నిర్మించామని, బెంగళూరు సిటీ సెంటర్ మల్లేశ్వరంలోనూ శాటిలైట్ సెంటర్‌ను తెరిచామన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రులలోనూ శాఖ ఉందన్నారు. కల్యాణ కర్ణాటకలో 2016లో 135 పడకల సామర్థ్యం కల్గిన ఆసుపత్రిని ఆరంభించామని, ప్రస్తుతానికి 85శాతం నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. ఏప్రిల్‌లో ఆరంభం కానుందన్నారు. పేదరికం, తగినంత సొమ్ము లేకున్నా చికిత్సలు జరిపించడమే లక్ష్యంగా ఆసుపత్రి పనిచేసిందన్నారు. ట్రీట్ మెంట్ ఫస్ట్, పేమెంట్ నెక్స్ట్ అనే విధానం ఇక్కడ దశాబ్ద కాలానికిపైగా అమలులో ఉందన్నారు. 2022 అధ్యయనంలో టాప్ ఐదు సెంటర్‌లలో జయదేవ నెంబరు వన్‌గా నిలిచిందన్నారు. ఆసుపత్రికి నిజమైన వీఐపీ అంటే అది పేద రోగి అన్నారు. 125మంది హృద్రోగ నిపుణులు ఉన్నారని, దేశంలో ఎక్కడా ఇంత మంది హృద్రోగ నిపుణులు లేరన్నారు. ప్రపంచ పటంలో జయదేవ ఆసుపత్రికి గుర్తింపు దొరికిందని అంతకుమించిన సంతోషం ఉండదన్నారు. డైరెక్టర్‌గా 16ఏళ్లు కొనసాగానని, ప్రభుత్వ నిర్ణయమే అంతిమమన్నారు. నా పదవీకాలం ముగింపు ప్రభుత్వానికి చెందిన అంశమన్నారు. నా జీవితంలో సిఫారసు చేయించుకునే అలవాటే లేదన్నారు. పాలకమండలి సభలో నేను ఉండదని, నాకు ప్రభుత్వం అభిప్రాయం కోరలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికే కొత్త డైరెక్టర్ పేరును నిర్ధారించుకున్నట్టు ఉందన్నారు.

మూడు తరాలుగా పూజలందుకుంటున్న 'రామ టంకా'

» అరుదైన వెండి నాణెం



'రామ టంకా' వెండి నాణేన్ని చూపుతున్న వెంకోబరావు



నాణేనికి ఇరువైపులా ఇలా...

శిడ్లఘట్ట, జనవరి 24: అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠాపనతో శ్రీరాముడి గురించిన ఎన్నో ప్రత్యేకతలు వెలుగు చూస్తున్నాయి. చిక్క బళ్ళాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకాలోని దేవరమళ్ళూరు గ్రామంలో అరుదైన 'రామ టంకా' వెండి నాణెం సుమారు మూడు తరాలుగా పూజలందుకుంటోంది. 83ఏళ్ల రిటైరైన ఉపాధ్యాయుడు ఏ వెంకోబరావు ఈ విషయాన్ని వెల్లడించారు. తమ ముత్తాతల కాలంనుంచి సాలిగ్రామం సహా ఈ 'రామ టంకా' వెండి నాణేనికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు. తండ్రి అశ్వత్థయ్య, తాత వెంకణ్ణ, ముత్తాత అశ్వత్థప్పలుగా తెలిపారు. మూడు తరాలుగా ఈ రామ టంకాను పూజిస్తున్నారన్నారు. విజయనగర కాలంనాటి నాణెంగా తెలిపారు. నాణేనికి ఒకవైపు శ్రీరాముడి పట్టాభిషేకం, మరోవైపు రామ లక్ష్మణులు ఉన్నారు. రామలక్ష్మణులిద్దరూ ధోతి ధరించి తలపై కిరీటంతో, ఎడమ చేత్తో విల్లును కలిగి ఉన్నారు. శ్రీరాముడు తన కుడి చేతిలో త్రిశూలం కలిగి ఉండడం విశేషం. నాణెంపై సంస్కృతంలో 'రామ లక్ష్మణ, జానక జొతె హనుమ' (విజయశాలి అయిన రామ, లక్ష్మణ, సీతా మరియు హనుమంతుడు) 1700గా ముద్రితమైంది. నాణేల సేకరణ కర్త హెచ్‌కే రామారావ్ మాట్లాడుతూ 'రామ టంకా'లు ఆయా కాలానికి అను గుణంగా రాజులు, కొన్ని దేవాలయాలు శ్రీరాముడి గౌరవార్థం ముద్రించాయన్నారు. 12వ శతాబ్దంలో తొలి రామ టంకా ముద్రించినట్టు తెలుస్తోంది. విజయనగర రాజులకాలంలో రామ టంకా వెండి నాణేన్ని వివిధ వస్తువుల వినిమయానికి వినియోగించినట్టు ఆధారాలు ఉన్నాయన్నారు. కాగా దేవర మళ్ళూరు గ్రామానికి చారిత్రక నేపథ్యం ఉండడంతో ఇక్కడి ఆలయాలను ప్రభుత్వం జీర్ణోద్ధరణ చేసి పర్యాటకానికి వీలు కల్పించాలన్నారు.

అలరించిన సామూహిక గేయాలాపన

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రంగస్థలం, సుగమసంగీతంలో మేటి ప్రతిభావంతులు సోమసుందరం అంటూ ప్రముఖ నాటకరంగ నిపుణుడు శ్రీనివాస జీ కప్పణ్ణ అభిప్రాయపడ్డారు. మంగళవారం రవీంద్ర కళా క్షేత్రలో రంగసంస్థాన సంస్థ ఆధ్వర్యంలో సామూహిక గేయాలాపన, సోమ సుందరం జన్మదిన వేడుకలు జరిపారు. శ్రీనివాస జీ కప్పణ్ణ మాట్లాడుతూ సుగమసంగీతం ద్వారా వేలాది మంది గాయకులుగా మార్చేలా మన సాహిత్యం ఉందన్నారు. జాతీయ కవి కువెంపు సాహిత్యం సామాన్యులు పాడుకునేలా ఉండేదన్నారు. సోమసుందరం 650 పాటలకు సంగీతాన్ని సమకూర్చగా 350 పాటలను పాడారన్నారు. విద్యానిపుణులు, గాంధీ స్మారక నిధి అధ్యక్షులు ఉడే పీ కృష్ణ మాట్లాడుతూ సంగీతం ద్వారా ఎన్నో సాధనలను చేసిన ఘనత సోమసుందరందే అన్నారు. ఇదే సందర్భంగా సోమసుందరం ఆలపించిన గేయాలను రంగసంస్థాన అధ్యక్షులు బండ్లహళ్ళి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వందమందికి పైగా మహిళలు ఆలపించారు. కన్నడ అధ్యాపకులు డాక్టర్ రుద్రేష్ అదరంగితో పాటు బీబీఎంపీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అమృత్‌రాజ్ తదితరులు భాగస్వామ్యులయ్యారు.



రవీంద్ర కళాక్షేత్రలో సామూహిక గేయాలాపన

అసమానత తొలగాలి: బీఈఓ

బాగేపల్లి, జనవరి 24: సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానత్వం తొలగాలని బీఈఓ తనుజా అభిప్రాయపడ్డారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పరగోడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంలో స్త్రీ నాలుగు గోడలకే పరిమితమైందేదని, సంసారం, ఇల్లు తప్ప వేరే ప్రపంచం ఉండేది కాదన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకుంటు న్నారన్నారు. అయినా కూడా సామాజిక తారతమ్యం, అసమానతను చవి చూస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. బాలికల విద్య, సురక్షతకోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. విద్యతోనే బాలికలు ఉన్నత హోదాలు పొందడం సాధ్యమన్నారు. చక్కగా చదివి మంచి ఫలితాలు సాధించి సమాజంలో ప్రతిభను చాటాలన్నారు. సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, హక్కులు, బాలికా విద్య, ఆరోగ్యం, పోషణ గురించి జాగృతి పెరగాలన్నారు. ఈ సందర్భంగా కన్వీనర్ కేబీ ఆంజనేయరెడ్డి, కేవీ రాజణ్ణ, ప్రధానోపాధ్యాయులు సీ వెంకటరాయప్ప, ఉపాధ్యాయులు రమాదేవి, గోవిందరాజు, సత్యనారాయణ, బీఏ లక్ష్మీ, రేష్మా తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న బీఈఓ తనుజా

భక్తి శ్రద్ధలతో శివబాలయోగి జయంతి



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

బెంగళూరు, జనవరి23 (ఆంధ్రజ్యోతి): శివబాలయోగి మహరాజ్ 89వ జయంతి వేడుకలు నగరంలోని జేపీ నగర్ ఆశ్రమంలో బుధవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. వేదపండితుడు గణపతి భట్ ఆధ్వర్యంలో అర్చక బృందం పలు హోమాలను నిర్వహించింది. అనంతరం పూర్ణాహుతిని నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి ప్రసంగించిన వేదపండితుడు గణపతిభట్ కర్మాను సారమే ఇహలోకంలో ఫలితాలు ఉంటాయన్నారు. పుణ్య కార్యాలు చేసి భగవంతుడిని ప్రసన్నం చేసుకోవాలని భక్తులకు పిలుపునిచ్చారు. ఆశ్రమం వర్కింగ్ చైర్మన్ డీ రాంబాబు మీడియాతో మాట్లాడుతూ ప్రతియేటా శివబాలయోగి మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకుంటూ వస్తున్నామన్నారు. ఈ వేడుకలకు నగరం నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు పూజలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం మానవాళి సంక్షేమం, శాంతి కోసం పలు హోమాలను నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతి, కుంభాభిషేకం కార్యక్రమాలకు పెద్ద పెట్టున మహిళలు హాజరయ్యారు. సాయంత్రం 5 గంటల నుంచి ధ్యానం, అనంతరం సాయంత్రం 6.30 నుంచి భజనలు జరిగాయి రాత్రి 7 గంటలకు జరిగిన గిరిజా కల్యాణోత్సవం అందర్నీ విశేషంగా అలరించింది.

స్పెల్-బి పోటీల్లో గ్రాండ్ ఫినాలెకు సానికా

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 5-9 తరగతుల విద్యార్థుల మధ్య నిర్వహిస్తున్న స్పెల్-బి పోటీలలో బెంగళూరు పరిధికి సంబంధించి సానికా ఎం రెడ్డి గ్రాండ్ ఫినాలెకు ఎంపికయ్యారు. మిర్చికిక్స్ సహకారంతో ఎస్‌బీఐ జీవిత బీమా సంస్థ 13వ విడత స్పెల్లింగ్‌ల పోటీలు జరుపుతోంది. స్పెల్ మాస్టర్ ఆఫ్ ఇండియా ప్రాయోజకత్వంతో ఆదివారం బెంగళూరులో జరిపారు. నగర పరిధిలోని 25 విద్యాసంస్థల నుంచి 10601ల మంది విద్యార్థులు పాల్గొన్నారు. చివరి రౌండ్‌కు 50మంది చేరగా చివరకు గ్రాండ్ ఫినాలేకు సానికా ఎంపికయ్యారు. ఎస్‌బీఐ జీవిత బీమా ప్రాంతీయ జనరల్ మేనేజర్ సతీష్‌కల్లెతో పాటు వివిధ సంస్థల ముఖ్యులు సానికాను సత్కరించారు. కార్పొరేట్ కమ్యూనికేషన్ ముఖ్యులు రవీంద్రశర్మా మాట్లాడుతూ యువ ప్రతిభావంతులను వెలుగులోకి తీసుకువచ్చేందుకే దేశ వ్యాప్తంగా స్పెల్‌బి పోటీలను జరిపామన్నారు. గ్రాండ్‌ఫినాలె ఫిబ్రవరి 24న జరుగుతాయన్నారు.



సానికాకు సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తున్న సతీష్‌కల్లె

వృద్ధురాలికి స్థానికుల చేయూత

శిడ్లఘట్ట, జనవరి 24: పట్టణంలోని కురుబరపేట 6వ వార్డులో బాడుగ ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్న 70ఏళ్ల నరసమ్మ అనారోగ్యానికి గురి కావడంతో స్థానికులు చేయూత ఇచ్చారు. నరసమ్మ నగరసభ కార్యాలయం ఎదురుగా తోపుడుబండితో జీవనం సాగిస్తోంది. కొడుకు ఉన్నా అమ్మ అనా రోగ్యం కారణంగా దూరంగా ఉంటున్నాడు. కాగా బుధవారం ఆమె పరిస్థితి విషమించింది. విషయాన్ని కొడుకుకు తెలిపినా స్పందించలేదు. దీంతో స్థానికులు వెంటనే నగరసభ సభ్యుడు వెంకటస్వామి, లియో క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్‌కు తెలిపారు. వారు స్వచ్ఛందంగా స్పందించి వెంటనే ఆసుపత్రిలో చేర్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది కూడా ఉన్నారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు, పోలీసులు ఇలా పలువురు సానుకూలంగా స్పందించి చేయూత ఇవ్వడంపై ప్రశంసలు వ్యక్తమయ్యాయి.



ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు, పోలీసులు

తస్తీక్ నగదు వాపసు ఇవ్వాలని అర్చకుడికి నోటీసులు

» తహసీల్దార్ తప్పిదమన్న ముఖ్యమంత్రి

» నోటీసులు రద్దుచేస్తామన్న దేవదాయశాఖ మంత్రి



నోటీసులు పొందిన అర్చకుడు కణ్ణన్

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చిక్కమగళూరు జిల్లా హిరేమగళూరు కోదండ రామాలయ అర్చకుడికి చెల్లించిన తస్తీక్‌ను (గౌరవ వేతనం) వాపసు చేయాలని తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. కోదండరామాలయానికి సుమారు 44 ఏళ్ళుగా కణ్ణన్ ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్నారు. అర్చకుడికి నెలవారీ రూ.7500 తస్తీక్ చెల్లించేవారు. ఇటీవల పదేళ్ళుగా ఆలయానికి ఆదాయం తగ్గిందనే కారణంతో వేతనంగా చెల్లించిన వేతనంలో నెలవారీ రూ.4500ల ప్రకారం రూ.4.74లక్షల వాపసు చెల్లించాలని అర్చకుడి కణ్ణన్‌కు తహసీల్దార్ సుమంత్ నోటీసులు జారీ చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు కన్నడ ప్రవచనాలు, మంత్రోచ్ఛరణల ద్వారా పూజలు జరిపించేవారు. నోటీసులు జారీ చేయడంపై అర్చకుడు కణ్ణన్ మీడియాతో మాట్లాడుతూ 44 ఏళ్ళుగా గుడిలో అర్చకుడిగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఆరంభంలో నెలకు కేవలం రూ.50లు మాత్రమే ఇచ్చేవారని ఆ తర్వాత రూ.75లు, 150లు ఇచ్చేవారన్నారు. కొన్నేళ్ళపాటు వేయి రూపాయలు వచ్చేవన్నారు. నాలుగుదశాబ్దాలకు పైగా అర్చకుడిగా పని చేశానని నోటీసులు ఇవ్వడం అవమానం చేసినట్లే అన్నారు. నేను ఎవరితోనైనా గట్టిగానే మాట్లాడగలనని అందుకే ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నట్లు మండిపడ్డారు. నోరులేని సామాన్య అర్చకుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు.

తహసీల్దార్ తప్పిదమన్న ముఖ్యమంత్రి

అర్చకుడు కణ్ణన్‌కు తస్తిక్ మొత్తాన్ని చెల్లించాలని నోటీసులు జారీ చేయడం తహసీల్దారు తప్పిదమేనని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. పదేళ్ళుగా తీసుకున్న తస్తీక్ నుంచి రూ.4500లు వాపసు చెల్లించాలని నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. ఇది పూర్తిగా తహసీల్దారు తప్పిదమని ఇందులో అర్చకుడి తప్పేమి లేదన్నారు. సర్వత్రా విమర్శలు రాగానే దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డి స్పందిస్తూ అర్చకుడికి ఇచ్చిన నోటీసులు రద్దు చేయాలని దేవదాయశాఖ కార్యదర్శిని ఆదేశించామన్నారు. తహసీల్దార్ తప్పు నిర్ణయంగా కొట్టిపారేశారు.

బెంగళూరు నుంచి భూటాన్‌కు నేరుగా చార్టర్లు

బెంగళూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): భూటాన్‌ను సందర్శించాలనుకునే వారి కోసం థామస్‌కుక్ నేరుగా చార్టర్లను సిద్ధం చేసినట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ రొమాలి పాంట్ ప్రకటించారు. బుధవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. విహార యాత్రలకు వెళ్ళేవారి కోసం థామస్‌కుక్ తగిన ప్యాకేజీలు సమకూరుస్తోందన్నారు. ప్రత్యేకించి దక్షిణభారత్ నుంచి ఏటా భూటాన్‌ను సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్న మేరకు ప్రత్యేక ఛార్టర్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 27, మే 4, 11వ తేదీలలో బెంగళూరు నుంచి నేరుగా భూటాన్ వెళ్ళవచ్చు అన్నారు. బెంగళూరు నుంచి భూటాన్‌కు నిరంతరం ప్యాకేజీలు ఉన్నా నేరుగా వెళ్ళే సౌలభ్యం కోసమే ప్రత్యేక ఛార్టర్‌లు సిద్ధం చేశామన్నారు. భూటాన్‌లో సందర్శించే ప్రదేశాలు ప్యాకేజీలో ఉంటాయన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక విభాగాలను ఇష్టపడే వారి కోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. దక్షిణాది ప్రజల కోసమే బెంగళూరుతో పాటు మైసూరు, మంగళూరు, ఉడుపి, హుబ్బళ్ళి వంటి ద్వితీయశ్రేణి నగరాలలోను థామస్‌కుక్ సేవలు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఒక్కరికి రూ.92వేలతో పాటు జీఎస్టీ అదనంగా ప్రకటించారు. కన్నడ భాష తెలిసిన నిపుణులతో పాటు గుణాత్మక ఆహారాన్ని సమకూరుస్తామన్నారు. కర్ణాటక నుంచి 30శాతం అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామని, యూరప్, ఆసియా ఖండాలకు ప్రత్యేక విభాగాలు ఉన్నాయన్నారు.

బ్యాగడదేనహళ్లి అధ్యక్షురాలిగా మంజుల



నూతన అధ్యక్షురాలికి సన్మానం

దొమ్మసంద్ర, జనవరి 24: ఆనేకల్ తాలూకాలోని బ్యాగడదేనహళ్ళి గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా మంజుళా మునిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంపై పంచాయతీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంజుళా మాట్లాడుతూ సభ్యులందరి సహకారంతో పంచాయతీలోని అన్ని ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు మెరుగు చేసి మాదిరిగా తీర్చి దిద్దుతామన్నారు. బ్యాగడదేనహళ్ళి పంచాయతీ సభ్యుడు దొడ్డహాగడె హరీశ్‌గౌడ మాట్లాడుతూ ఎమ్మెల్యే, ఎంపీల నిధులను సద్వినియోగం చేసుకుని పంచాయతీని ఆదర్శంగా తీరుస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆనేకల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ హాగడె హరీశ్‌గౌడ, శాంతమ్మ భైరేగౌడ, వీణా మునిరెడ్డి, రత్నమ్మ రాజప్ప, కెంప ఒడెరహళ్ళి మంజణ్ణ, వేణుగోపాల్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాదరకల్లు డెయిరీ అధ్యక్షుడిగా రవి ఏకగ్రీవం



అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

చింతామణి, జనవరి 24: తాలూకాలోని కైవార హోబళి హిరేకట్టిగానహళ్ళి గ్రామ పంచాయతీ పరిధిలోని మాదరకల్లు గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌ల స్థానాలకు ఇటీవల ఎన్నికలు జరగ్గా బుధవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా జేడీఎస్ మద్దతుదారుడైన రవి, ఉపాధ్యక్షుడిగా ఎంసీ నటరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌లు గోవిందప్ప, వెంకటేశప్ప, గోపాలప్ప, ఎం కృష్ణప్ప, నరసింహప్ప, నారాయణస్వామి, సుశీలమ్మ, ద్యావప్ప, యశోదమ్మ, భాగ్యమ్మ, డైరీ కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామపంచాయతీ మాజీ సభ్యులు మంజునాథ్, వీణా కృష్ణేగౌడ, శివశంకర్, గోపాల్, శ్రీకాంత్, వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవం నగరంలోని టౌన్‌హాల్‌లో గురువారం ఉదయం జరుగనుంది. ఈ కార్యక్రమానికి గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. చీఫ్ ఎలక్షన్ కమీషనర్ మనోజ్‌కుమార్ మీనా అధ్యక్షత వహిస్తారు. బీబీఎంపీ చీఫ్ కమీషనర్ తుషార్ గిరినాథ్ ప్రత్యేక అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం నగరంలో బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

సంతానలేమిపై ప్రత్యేక శిబిరం

బెంగళూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మాతృత్వం పొందడమనేది ప్రతి మహిళా జీవితంలో ముఖ్యమైనదిగా భావిస్తారు. సంతానలేమి సమస్యలు ఎదుర్కొనే మహిళల కోసం గుణశీల ఆసుపత్రిలో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని ఉచిత శిబిరం ఏర్పాటు చేశారు. బసవనగుడి కేంద్రంలో పరీక్షలతో పాటు సందేహాలతో కూడిన అన్నీ ఉచితంగా పొందే వెసలుబాటు ఉన్నట్లు ప్రకటించారు. సమగ్ర డయాగ్నస్టిక్ ప్యాకేజ్ ఉచితంగా పొందదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ప్రకటించారు. రిజిస్టర్ చేసుకున్నవారికి కన్సల్టేషన్, ఎగ్జామినేషన్, ఇన్వెస్టిగేషన్‌లతో కలిపిన సంపూర్ణ ప్యాకేజీ ఉచితమన్నారు. ఐవీఎఫ్ విధానంతో 74శాతం ఫలితాలు సాధించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

భారీ జాతీయపతాక ప్రదర్శనకు సన్నాహాలు

చింతామణి, జనవరి 24: గణతంత్ర వేడులకు ఈసారి 2200 అడుగుల పొడవైన జాతీయ పతాకాన్ని ప్రదర్శించేందుకు ఆర్యవైశ్యమండలి సిద్ధమైంది. 2013 గణతంత్ర వేడుకల్లో వాసవి యువజనసంఘం, లయన్స్‌క్లబ్ చింతామణి, కొమర్ల బృందం సంయుక్తంగా 1100 అడుగుల జాతీయ పతాకాన్ని సుమారు 2వేలమంది విద్యార్థులు ఊరేగించిన సంగతి విదితమే. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా పెనుగొండ సమీపాన గల రొద్దంలోని సహారా కేడెట్ సొసైటీకి చెందిన లక్ష్మీనారాయణ గుప్త ఈసారి 2200 అడుగుల జాతీయ పతాకాన్ని సిద్ధం చేస్తున్నారని ఆర్యవైశ్యమండలి నిర్వాహకులు తెలిపారు.